# నేరం ఎవరిది?

-కవిత

అర్ధరాత్రి.

ఊరు నిద్రపోతోంది. అంతా నిశ్శబ్దమూ నీర వమూ.

అటువంటి నిశీధి వేళలో.. తలుపు మీద... "టిక్... టిక్... టిక్..."

రానున్న విపత్తుకి సూచనలా చిత్రమయిన - చిన్న శబ్దం. దానికే త్రుళ్ళిపడి మేలుకుని కనులు తెరిచింది తరుణ.

ఇంకా ఆ శబ్దాలు అలాగే. "టిక్... టిక్... టిక్..." ఆమె కలవరపడింది. బెదిరిపోయింది. కొంచెం ఆలోచించి. గుండె చిక్కబట్టుకుని - తలుపు తీయడానికే నిర్ణయించుకున్నట్టు లేచి ద్వారం వైపు నడిచింది.

"ఎవరు?" అడుగుతూనే తలుపు తీసింది.

"ఉష్.. మెల్లగా. భయంలేదమ్మా తరుణా! నేనే. నీ నాన్నని"

"మీరేనా! ఏమయింది నాన్నగారూ? అర్ధరాత్రి నిద్రలేపారెంటీ... ఏం జరిగింది?"

ఆమె కంఠం నిండా కంగారూ భయమూ.

"ఒక్కసారి నాతోరా. నీతో కొంచెం మాట్లాడాలి."

"ఈ అర్ధరాత్రి మాటలా! దేని గురించి? అంత కొంపేం మునిగిందీ?"

ఆయనేమీ జవాబు చెప్పకుండానే నడిచాడు. ఆమెకాయననను సరించ తప్పలేదు. ఇటువంటి ఏదీ కాని వేళ అంత అర్జంటుగానూ రహస్యంగానూ నాన్నగారు తనతో మాట్లాడేదేమిటో? ఆలోచిస్తూనే నడవసాగిందాయన వెంట. మెట్లెక్కి డాబా మీదకు వొచ్చాక - తన ముఖం నీడలో వుండేలా పిట్ట గోడకానుకుని కూర్చుని. అంతవరకూ చేతితో పట్టుకున్న నీళ్ళ గ్లాసుని తనకెదురుగా పెట్టి "కూర్చోమ్మా..." అన్నాడాయన. ఆమె కూర్చుని - ఆ గ్లాసును చూసింది.

నిద్రలోంచి లేచి వొచ్చిందేమో నీళ్ళ గ్లాసుని చూసేసరికి దాహం వేసినట్టనిపించిందామెకు. "నేనా నీళ్ళు తాగుతాను నాన్నా!" అంది.

ఒక్కసారాయన కంగారు పడిపోయాడు. "వొద్దమ్మా. అవి నా కోసం. నీకంతగా దాహమయితే - నా మాటలు విన్నాక - కిందకు వెళ్ళి తాగుదువుగానిలే."

తండ్రి వైఖరి ఆమెకు కొత్తగానూ అయోమయంగానూ అనిపించింది.


"నేను నిన్నిలా వేళకాని వేళ నిద్ర మధ్యలోంచి లేపి తీసుకురావడానికి కారణం- నీ క్షమాపణలు కోరాలని. నన్ను క్షమించమనాలని..." ఆయన కంఠంలో వణుకు.

"ఏమిటి నాన్నా మీరనేది?" ఆయన ధోరణి ఆమెను భయపెట్టింది.

"ఎక్కువ నాన్చుడూ. ఉపోద్ఘాతమూ లేకుండానే అసలు విషయం చెబుతాను. ఈ వ్యవస్థలో నువ్వు పెళ్ళికాని అమ్మాయివి. నేనొక మధ్యతరగతి కుటుంబీకుణ్ణి. మనం - అలా మాట్లాడుకుందాం, చూడమ్మా! బాధననుభవించడం కంటే - మనకి అయినవారు బాధపడుతుంటే చూడడం మరీ కష్టం."

"ఔను" అందామె.

"సిగ్గు. మొహమాటం లేకుండా వున్నదున్నట్టు చెబుతాను. అర్థం చేసుకో. నేనొక మధ్యతరగతి సంసారిని. సంతానం ఎక్కువ. సంపాదన తక్కువ. నా రాబడిలో సంసారం నడవడమే గగనం. జీత







మంటే ఒకటో తారీకుకి నిర్వచనం. పాత అప్పుల వడ్డీలు తీర్చి కొత్త అప్పులు మొదలుపెట్టే రోజు. జీవిత మంటే – ప్రతీదానికి లోటూ, ఆశా, భంగపాటూ, నిస్పృహ. దొరికినన్ని అప్పులు చేసినా దినం గడవని దైన్యం. తిప్పలే నాకు మిగిలిన ఆస్తి. ఐతే – బాధ్యతలు మాత్రం తక్కువ కావు. పెద్ద అమ్మాయి వయిన నీకు పెళ్ళి చెయ్యడం ఎన్నేళ్ళ కిందటి నుంచో నా తక్షణ బాధ్యతా. తీరని కోరిక. ఆ బాధ్యత నెరవేర్చలేక యిప్ప టికే ఎంతో కాలహరణం చేశాను. నువ్వు నీ భర్తతో సుఖంగా కాపురం చేస్తూంటే కళ్ళారా చూసి సంతో షించాలనేది నా కోరిక. అయితే అవి వొట్టి కోరికలే. కల్లే. ఎందు కంటే వరుడిని కొనడానికి నా దగ్గర వేలాది రూపాయలు లేవు. ఎప్పటికీ వుండవు కూడా. కట్నం కోరకుండా నిన్ను కళ్యాణం చేసుకునే ఉదా రుడూ విశాల హృదయుడూ తార సపడతాడేమో అని ఆశపడుతూ ఆత్మవంచన చేసుకుందామన్నా యీ వ్యవస్థలో అటువంటి ఆస్కారమూ లేదు ఆశాలేదు. నీకేమో యీడు ముదిరిపోతోంది–" గద్గదికమయిం దాయన కంఠం.

"పోన్లెండి నాన్నా! జీవితమంటే పెళ్ళే కాదుగా?"

"నువ్వా మాట ఎంత నిరాశ, వైరా గ్యాల అనంతరం అంటున్నావో నేను గ్రహించగలను తల్లీ! నీ మాటలు నా గుండెను మరి కోస్తున్నాయి. నా చేతకాని తనానికి సిగ్గుతో తల వొంచుకుంటున్నాను. జీవితమంటే వివాహం మాత్రమే కాదనేదెంత నిజమో వివాహం కానిదే జీవి తమూ లేదన్నది కూడా అంతే నిజం. వివాహం జీవితానికి సుఖాన్నీ సంపూర్ణత్వాన్ని యిస్తుంది. ఒక దశలో శరీరానికి జీవితాంతమూ మనసుకీ సాహచర్యమనేది అత్య వసరం. అదే జీవన సౌందర్యం. అది లేని జీవితం ఎడారికంటే అతి భయంకరం. ఇది స్పష్టం. మన కందనంత మాత్రాన ద్రాక్షలు పుల్ల నకావు."

"నాన్నగారూ!"

"అయ్యో చెట్టు ఆకులలోనే తెలి సిపోతుందని – యిప్పటికీ నా అప్ర యోజకత్వమూ అసమర్థతా అన్ని విధాలా బయటపడిపోయింది. ఈ జన్మలో నీకు పెళ్లి చేయలేననేది – నిష్ఠురంగా వున్నా నిజం. మనసుని మభ్యపెట్టుకోకుండా నువ్వూ నిజం చెప్పు. ఈ జీవితం నీకు మాత్రం ఏం బాగుంది?"

"నిజమే" నిట్టూర్చిందామె భారంగా "నాకు పెళ్ళి చేసి పంపనం దుకు నలుగురూ నానామాటలు ఆడుతూ నిన్నెలా నిలవనివ్వడం లేదో అలాగే నేనెక్కడికి వెళ్ళినా నా కాళ్ళకింద నిప్పులు పోస్తూ నన్నూ నిలవనివ్వడం లేదు. రోడ్డె క్కితే చాలు ప్రతి మగవాడూ నావేపు వంకర చూపులు చూడ డమూ వెకిలి మాటలు విసర డమూ. మెడలో మంగళసూత్రము న్నంత మాత్రాన స్త్రీని అందరూ గౌర వించేస్తారని కాదు కానీ అది కూడా లేకపోవడంతో నా బతుకు నలుగు రికీ మరీ అలుసైపోయి తలుచు కుంటేనే ఏడుపొస్తూంది" అందామె ఏడుపు మాత్రమే తక్కువగా.

"నాకు తెలుసమ్మా. అంతా తెలుసు. అందుకే నేనీనిర్ణయం తీసు కున్నాను"

"ఏమిటి నాన్నగారూ?"

"నీకు పెళ్ళికాకపోతే ఆ నేరం నీది కాదు. అప్రయోజకుడినయిన నాదీ. వివాహానికి వరకట్నమే అత్యంత ప్రధానంగా మార్చిన యీ వ్యవ స్థదీ. న్యాయంగా నేనో సమాజమో శిక్షించబడాలి. కాని – నిరపరాధి వయిన నువ్వు భరిస్తున్నావు శిక్షని! ఇది చూడలేకనే..." ఒక్కసా రాగి... ఈ గ్లాసులో నీళ్ళు న్నాయి చూశావా? వొట్టి నీళ్ళు కావు. రెండు గుక్కలు తాగితే – రెండు నిమిషాలలో మనిషిని సమ స్యల నుంచీ జీవితం నుంచీ శాశ్వ తంగా దూరం చేసే విషం కలిసిన నీళ్ళు. ముందే చెప్పాను కదమ్మా – బాధననుభవించడం కంటే అయిన వారి బాధను చూడవలసి రావడమే ఎక్కువ బాధ అని. మోడువారిన నీ జీవితాన్ని యింకెంత మాత్రమూ చూడలేక..." అంటూ ఆ గ్లాసు నందుకోబోయాడాయన.

కానీ – అప్పటికె.

తరుణ చటుక్కున ఆ గ్లాసునం దుకుని ఆ నీళ్ళని గటగట తాగే సింది.

"నువ్వు చెప్పింది చాలా నిజం నాన్నా. బాధను చూడడం కంటె బాధననుభవించడమే తేలిక. అందుకే నా సమస్యను... నేనిలా పరిష్కరించుకుంటున్నాను"

●

